క్లుప్తంగా

ప్రథమ వార్షికోత్సవ పూజలు ప్రారంభం



లింగాల: మండల పరిధిలోని అవుసలికుంటలో మూడు రోజుల పాటు నిర్వహించే గ్రామ దేవత బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవ పూజలు ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శక్తి పూజారీ బైండ్ల గిరి ఆధ్వర్యంలో బొడ్రాయి వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు నీరు తీసుకొచ్చి డప్పు వాయిద్యాల మధ్య బొడ్రాయికి జలాభిషేకం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ శివారులోని కోట మశమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు వైద్యశిబిరం



చారకొండ: మండల కేంద్రానికి చెందిన గ్రామీణ వైద్యులు చీల్వేరు శ్రీనివాసులు శ్రీశైలం పుణ్యక్షేత్రంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనం కోసం భక్తులు రావడంతో, వారి సౌకర్యార్థంగా శ్రీశైల క్షేత్రంలో పద్మాశాలి సత్రం ఆవరణలో భక్తులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. 14 సంవత్సరాల నుంచి వారి తల్లిదండ్రులు మల్లప్ప, మల్లమ్మ జ్ఞాపకార్థం శివరాత్రి, ఏకాదశి, భక్తుల రద్దీ సందర్భంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



నాగర్‌కర్నూల్ క్రైం: మాధవుడు ప్రబోధించిన గీతా జ్ఞానమే త్రైత సిద్ధాంతం భగవద్గీత అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి నాగర్‌కర్నూల్ కమిటీ అధ్యక్షుడు మనోహర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్నేహపూరి కాలనీలో త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రజలకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పర్వతాలు, వెంకటన్న, నిరంజన్, చంద్రకళ, స్వప్న, పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు



చారకొండ: మండలంలోని తుర్కలపల్లి పంచాయతీ పరిధిలోని నూకల చింతవాడిక తండాకు చెందిన ఇస్లావత్ జైపాల్ నాయక్ ఆదివారం పశువులకు నీటిని తాపేందుకు పొలం వద్దకు వెళ్లాడు. పిడుగు పాటుకు గురై అక్కడే అపస్మారక స్థితిలో పడిపోయాడు. పక్క పొలంలోని వారి బంధువులు గమనించి ఘటన స్థలం చేరుకొని వారిని పరిశీలించి, వెంటనే 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నట్లు బంధువులు తెలిపారు.

భక్తులను వెంటనే విడుదల చేయాలి

అచ్చంపేట రూరల్: కరీంనగర్ పట్టణంలో శాంతి యుతంగా శోభాయాత్ర నిర్వహించిన హనుమాన్ భక్తులను అరెస్టు చేయడం సరైంది కాదని ఆంజనేయ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సబావత్ బలరాంలాల్ అన్నారు. ఆదివారం అచ్చంపేటలో నిర్వహించిన హనుమాన్ భక్తుల ముఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులు అదుపులో తీసుకున్న హనుమాన్ భక్తులపై ఎలాంటి కేసులు నమోదు చేయకుండా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గొడవలను ఉద్రిక్తలను అదుపు చేయాల్సిన పోలీసులు వాటిని పెంచే ప్రయత్నం చేయటం శోచనీయమన్నారు.

అంధకారంలో 'సింగారం'

అచ్చంపేట రూరల్: మూడు రోజులుగా మండలంలోని సింగారం గ్రామంలో అంధకారం నెలకొంది. శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతు చేపడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీగా ఈదురు గాలులు వీచడంతో పెద్ద వృక్షాలు నేలకొరగగా... మామిడికాయలు రాలిపోయాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అలాగే ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు బాల్యతండాలోని సోమ్లానాయక్ ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి.

ఈదురుగాలులు.. భారీ వర్షం

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం దాదాపు 45 నిమిషాల పాటు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై నీరు నిలవడంతో పాటు, పలుచోట్ల మురుగు రోడ్లపై పారింది. జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు వెళ్లే దారిలో పెద్ద ఎత్తున నీరు నిలిచిపోవడంతో వాహనదారులు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురియడంతో కొన్నిచోట్ల చెట్లు నేలకొరిగాయి.



వెల్దండ మండలం కొట్రగేట్ సమీపంలో రోడ్డుపై చెట్లు పడిపోవడంతో నిలిచిన వాహనాలు

పిడుగుపాటుకు పాడి ఆవు మృతి

వెల్దండ: మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ఒగ్గు బాలకిష్టయ్య రైతుకు గాయలు కాగా, పాడి ఆవు మృతిచెందింది. వర్షం రావడంతో వ్యవసాయ పొలంలోని చెట్టుకింద పాడి ఆవుతో పాటు రైతు ఉన్నారు. ఒక్కసారిగి భారీ వర్షంతో పాటు ఉరుములు మెరుపులు వచ్చాయి. వ్యవసాయ పొలం వద్దం బాలకిష్టయ్య కళ్లు తిరిగి కింద పడిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన బాలకిష్టయ్యను చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందన్నారు. పాడి ఆవు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పాడి ఆవు విలువ దాదాపుగా రూ.70 వేలు ఉంటుందన్నారు. ప్రభుత్వ పరంగా రైతు కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

కల్వకుర్తి టౌన్: పట్టణంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పట్టణంలోని పలు రోడ్లు జలమయమయ్యాయి. గంటపాటు భారీ గాలులతో కురిసిన వర్షానికి సివిల్ కోర్టు జడ్జి అతిథిగృహంలోని చెట్టు నేలకొరిగింది. ఇందిరానగర్‌కు వెళ్లే రోడ్డులో చెట్టు నేలకొరగడంతో కొద్దిసేపు వాహనాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. అదేవిధంగా సిల్వర్‌జూబ్లీ క్లబ్ ఎదురుగా ఉన్న రెండు హోర్డింగ్‌లకు ఉన్న ఫ్లెక్సీలు పక్కనే ఉన్న హైటెన్షన్ వైర్లపై పడ్డాయి. ఫ్లెక్సీలు విద్యుత్ తీగలపై పడటంతో భారీ శబ్దం రావటంతో, వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మున్సిపల్ సిబ్బంది రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను వర్షం ముగిశాక తొలగించారు. విద్యుత్ అధికారులు ఫ్లెక్సీలను తొలగించి దాదాపు రెండు గంటల తర్వాత విద్యుత్‌ను పునరుద్ధరించారు. అలాగే పట్టణంలోని పలుచోట్ల వేలాడుతున్న విద్యుత్ తీగలు తెగిపడ్డాయి.

వెల్దండ: మండల పరిధిలోని కొట్ర, రాచూర్, తిమ్మినోనిపల్లి, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. కల్వకుర్తి–హైదరాబాద్ జాతీయ రహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. దీంతో వాహనాలకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. పోలీసులు సిబ్బంది శ్రమించి చెట్లను తొగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. అదే విధంగా కొట్ర, తిమ్మినోనిపల్లి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కూలిన కోళ్లఫారాలు

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలో మారేపల్లి కాలనీ సమీపంలో కర్ణాకర్‌రెడ్డి నూతనంగా నిర్మించి కోళ్ల ఫారం ప్రారంభానికి సిద్ధంగా ఉండగా గాలివానకు పూర్తిగా నేలకూలింది. అదే గ్రామానికి చెందిన వెంకటయ్య వ్యవసాయంలో పొలం పనులు చేస్తుండగా.. కాస్త దూరంలో పిడుగు పడింది. దీంతో అపస్మారక స్థితిలోకి పడిపోయిన వెంకటయ్యను స్థానికులు గుర్తించి వెంటనే జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. మారేపల్లికి చెందిన రత్నారెడ్డి, నరేష్‌రెడ్డి ఇళ్ల పైకప్పులు గాలికి ఎగిరిపడ్డాయి. బాజీపూర్‌కి చెందిన ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభం కిందపడింది. తిమ్మాజీపేట మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు, చెట్లు, ఇంటి ముందు రేకులు, గుడిసెలు చెల్లాచెదురుగా కూలిపోయాయి.

బిజినేపల్లి: మండల కేంద్రంలోని నయాగారా వాటర్ ప్లాంట్ ముందు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ కూలి కింద పడింది. మండల కేంద్రంలో దాదాపు 10 వరకు విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్తు సరఫరాను అధికారులు ముందుగానే నిలిపివేయడంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. భారీగా ఆస్తినష్టం వాటిల్లింది. పాలెంలో రోడ్డుపై చెట్లు విరిగిపడ్డాయి.



బిజినేపల్లి మండల కేంద్రంలో పడిపోయిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్



జిల్లాకేంద్రం రాంనగర్ కాలనీలో రహదారి ఇలా..



మారేపల్లిలో కూలిన కోళ్ల ఫారం



చౌదర్‌పల్లిలో పిడుగు పాటుకు మృతిచెందిన ఆవు

'గణితంలో రాణించడం సులభమే'

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని మినీ స్టేడియంలో వేదిక్ మ్యాథ్స్ గురించి విద్యార్థులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు 250 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వారిని ఉద్దేశించి ఫౌండేషన్ ట్రస్టీ జూపల్లి జగన్మోహన్ రావు, కన్వీనర్ కేతూరి ధర్మతేజ మాట్లాడారు. అన్ని సబ్జెక్టుల్లో బట్టీ చదువులు ఉపయోగపడతాయి కానీ గణితంలో మాత్రం ఇది సాధ్యం కాదన్నారు. విద్యార్థుల ప్రతిభ ద్వారానే గణితంలో రాణించవచ్చన్నారు. కొన్ని మెళకువలు పాటిస్తే గణితంలో రాణించడం సులభమే అన్నారు. ఈ అంశాలను



సదస్సుకు హాజరైన విద్యార్థులు

విద్యార్థులకు తెలియజేసేందుకే ఈ సదస్సు నిర్వహించినట్లు వివరించారు. రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యతో పాటు, క్రీడా, ఉపాధి అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. అర్థమేటిక్ రీజనింగ్ ట్రైనర్ టి.వెంకటేష్ గణితానికి సంబంధించిన పలు అంశాలను వివరించారు.

మైసమ్మ జాతరలో భక్తుల రద్దీ

కొల్లాపూర్: మండలంలోని నాగినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మైసమ్మ దేవతను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు 9 వేల మంది భక్తులు హాజరైనట్లు దేవాదాయ శాఖ అధికారి రంగారావు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రైవేటు వాహనాల్లో తరలివచ్చారు. వ్యవసాయ



మైసమ్మ దేవత ఆలయం వద్ద భక్తులు

పనులు ప్రారంభమైన నేపథ్యంలో రైతులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు.

ఆర్థిక సాయం అందజేత



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని భగీరథ దేవాలయం ఆవరణలో నిర్వహించే మహరుద్ర హోమం కార్యక్రమానికి బీజేపీ నాయకుడు గుర్రాల రాంభూపాల్‌రెడ్డి ఆదివారం ఆలయ కమిటీ నిర్వాహకులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, వివేకానంద, భీమయ్య, చిరంజీవి, దుర్గయ్య, రాజు, యాదగిరి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉప్పునుంతల: మండల సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం ఉదయం కాంసానిపల్లి సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ శేఖర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ లెనిన్ తెలియజేశారు.


సౌకర్యాలు కరువు

- పెచ్చులూడుతున్న ప్రభుత్వ పాఠశాలల భవనాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు



శిథిలావస్థలో నిరుపయోగంగా ఉన్న బాత్రూంలు

మన్ననూర్: మధ్యతరగతి కుటుంబాల్లోని పిల్లలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించలేని దీనమైన పరిస్థితిలో ప్రభుత్వాల తీరు ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటి, రెండు పాఠశాలలు మినహాయిస్తే ఉమ్మడి అమ్రాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహణలో ఉన్న ఒక్క పాఠశాల కూడా ఆకర్షణీయంగా లేవు. విద్యా సంస్థలకు నిలయమైన మన్ననూర్‌లో రెండు రెసిడెన్షియల్ పాఠశాలలతో పాటూ గిరిజన ఆశ్రమ, ఉన్నత పాఠశాలలు మూడు ప్రాథమిక పాఠశాలలు, ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహణలో ఉన్నాయి. ఈ క్రమంలో రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలు మెరుగ్గా లేవు. భవనం లోపలికి వెళ్లి చూస్తే పెచ్చులూడిన భవనాలు, విరిగిపోయిన బెంచీలు కుర్చీలు, నెర్రెలు బారిన బ్లాక్ బోర్డులు, నిర్వహణలో లేని బాత్రూం, తాగునీరు లేక, ఫ్యాన్లు లేని తరగతి గదులు, కరెంటు సౌకర్యం లేక, రక్షణ గోడలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిచ్చి మొక్కలు, అపరిశుభ్రంగా పాఠశాల ప్రాంగణాలు ఉన్నాయి.



శిథిలావస్థలోని పాఠశాల పరిసరాలు

– ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లను సరఫరా చేసే విషయంలో ముందస్తు కార్యాచరణ ప్రారంభించింది. ఈ క్రమంలో శిథిలావస్థలోని గ్రామీణ పాఠశాలలకు మరమ్మతు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యార్థులు కోరుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా ప్రభుత్వ విద్యావిధానంలో మార్పు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ వైభవం తీసుకురావాలి..

గతంలో 500 నుంచి 600 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యనభ్యసించేవారు. ప్రస్తుతం పాఠశాలలో ఆ సంఖ్య ప్రమాద స్థాయిలోకి పడిపోయింది. పాఠశాల పూర్వ విద్యార్థి మూడేళ్ల కిందట ఉదారంగా కొన్ని బెంచీలు, కుర్చీలు, పాఠశాల ఎదుట స్టేజీ ఏర్పాటు చేయించాడు. ప్రస్తుతం అవి మాత్రమే పాఠశాలలో వసతులుగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా పాఠశాల ప్రహరీలు శిథిలం కావడంతో పాఠశాలలకు రక్షణ లేకుండా పోయింది. రాత్రి సమయంలో పాఠశాల ప్రాంగణం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. అధికారులు పట్టించుకొని పాఠశాలకు పూర్వవైభవం తీసుకురావాలని కోరుతున్నారు.


పాఠశాల దీనంగా ఉంది..



గ్రామంలోని గిరిజన ఉన్నత పాఠశాల పరిసరాలు దీనంగా ఉన్నాయి. పాఠశాలలో పరిసరాలు, వసతులు కొంతైనా మెరుగు పరిచి విద్యార్థులు పాఠశాలకు సక్రమంగా వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– కృష్ణయ్య, విద్యార్థి తండ్రి, ప్రశాంతినగర్

అభివృద్ధికి కృషి చేస్తాం..



గ్రామంలోని గిరిజన ఉన్నత పాఠశాలకు మంచి పేరు ఉంది. పదేళ్ల కాలంలో పాఠశాల గురించి పాలకులు ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లి.. పాఠశాలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం.

– ఎంపీ రహీం, అమ్రాబాద్

మరమ్మతుకు నిధులు

అమ్రాబాద్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు కనీస మరమ్మతుల నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.25,000 చొప్పున నిధులు మంజూరయ్యాయి. పాఠశాలలు ప్రారంభం నాటికి అన్ని పాఠశాలల్లో అవసరమైన మేరకు పనులు చేయిస్తాం. మేజర్ పనులకు కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుంది.

– బాలకిషన్, ఎంఈఓ

నిత్యాన్నదానానికి విరాళం

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో కొనసాగుతున్న నిత్యాన్నదానానికి దాతలు విరాళాలు అందిస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉందని, సుమారు 1200లకు పైగా భక్తులు నిత్యాన్నదాన సత్రంలో భుజించారని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎడ్ల అఖిల్ కుమార్, ప్రణీత, ఆర్యన్‌కుమార్, అర్జున్‌కుమార్ ఆలయంలో పూజల అనంతరం నిత్యాన్నదానం కోసం



రసీదు అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్

రూ.25,116లు విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చెప్పండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నీతి



అవుసలికుంటలో ఏఓ నాగార్జునరెడ్డి

బిజినేపల్లి: రసీదుల్లో ఎంఆర్‌పీలు నమోదు చేసి నగదు రూపంలో అధిక ధరలకు విక్రయించే విత్తన వ్యాపారుల సమాచారం తమకు ఇవ్వాలని ఏఓ నీతి కోరారు. ఆదివారం మండలంలోని వట్టెంలో పంట విత్తనాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడారు. రైతులు ఎంఆర్‌పీ ధరకంటే ఒక్క రూపాయి కూడా అదనంగా చెల్లించరాదని, కాదని వసూలు చేసే వ్యాపారుల సమాచారం తమకు ఇస్తే గోప్యంగా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు రసీదుల్లో తప్పకుండా లాట్ నంబర్ ఉండేలా చూడాలని, జీఈఎస్‌ నంబర్ ప్యాకెట్ మీద ఉంటేనే తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారి సమాచారం తమకు ఇవ్వాలన్నారు. వ్యాపారులు ఎమైనా.. ఇబ్బందులకు గురిచేస్తే 7288894332 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి

లింగాల: వానా కాలం సీజన్‌లో పంటలు సాగు చేసే ముందు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగార్జున రెడ్డి రైతులకు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని అవుసలికుంటలో పంటల సాగులో విత్తనాల ఎంపిక, మెళకువల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడారు. నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని, లూజ్ విత్తనాలను కాకుండా పేరొందిన కంపెనీలు తయారు చేసిన విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తన శుద్ధి అవసరమని సూచించారు. పంటలు సాగు చేసే ముందు వ్యవసాయ శాఖ వారి సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. ఏఈఓ సురేంద్రరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులు చదవాలి



అమ్రాబాద్‌లో మాట్లాడుతున్న అనురాధ

అమ్రాబాద్: తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సీబీఎం ట్రస్టు చైర్‌పర్సన్, జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ సూచించారు. ఆదివారం మండల కేంద్రం ఉర్దూ మీడియం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉర్దూ మీడియం పాఠశాల నడిచేందుకు తన వంతు కృషి చేశానని వివరించారు. ఖచ్చితంగా పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, వైస్‌ఎంపీపీ ప్రణీత, ఇస్మాయెల్, జావెద్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాల జిల్లా



మార్చాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆదివారం 2008–2009 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్య నేర్పి మృతిచెందిన ఉపాధ్యాయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మంచి, చెడులు చర్చించుకున్నారు. సమ్మేళనానికి హాజరైన ఉపాధ్యాయులను సన్మానించారు. తమ స్నేహితులు లావణ్య, మణెమ్మలకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లయ్య, రాములు, సుగుణ, నారాయణగౌడ్, రేణుక, మురళీధర్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, రవీంద్రచారి హాజరయ్యారు.

శ్రీధర్‌రెడ్డి హత్యపై విచారణ చేపట్టాలి

కొల్లాపూర్: లక్ష్మీపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్యపై నిష్పక్షపాత విచారణ జరపాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శ్రీధర్‌రెడ్డి హత్యపై సానుభూతి చూపకుండా ఆయన క్యారెక్టర్‌ను బదనాం చేసేలా మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు, కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ఐదు నెలల కాలంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ నాయకులపై ఇష్టానుసారంగా దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో జరుగుతున్న హత్యలు, దాడులపై ఉన్నతస్థాయి అధికారులతో విచారణ జరపాలన్నారు. సమావేశంలో రాంచందర్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, కాటం జంబులయ్య, శ్రీనివాస్ యాదవ్, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

పెద్దకొత్తపల్లి: లక్ష్మీపల్లిలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్యలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు హస్తం ఉందని కేటీఆర్, హర్షవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌లు ఆరోపించడం సమంజసం కాదని పెద్దకొత్తపల్లి మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు విష్ణు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు అనవసరంగా జూపల్లిపై బురదజల్లే ఆరోపణలు మానుకోవాలన్నారు. గంట్రావుపల్లిలో ఆర్మీ జవాన్ మల్లేష్ హత్య భూతగాదాలతో జరిగితే దాన్ని మంత్రికి అంటగట్టే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నిరాధార ఆరోపణలు మానుకోవాలన్నారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు



ప్రైవేటు వాహనాలు, ప్రయాణికులతో రద్దీగా ఉన్న మన్ననూర్–శ్రీశైలం ప్రధాన రహదారి

మన్ననూర్: శ్రీశైలం పుణ్యక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. రహదారులపై వాహనాలు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. నాలుగు రోజులుగా వందల సంఖ్యలో కార్లలో ప్రయాణాలు జరుగుతున్నప్పటికీ మన్ననూర్‌లో బస్సు ప్రయాణాల కోసం బస్సు స్టాప్‌లో శ్రీశైలం వెళ్లేందుకు భక్తులు గుంపులు గుంపులుగా ఉంటున్నారు. ఆయా డిపోల నుంచి శ్రీశైలం వెళ్లే ఆర్టీసీ బస్సులు అక్కడి నుంచే బస్సుల్లో నిలబడి వెళ్తున్నారు. దీంతో బస్సులు మన్ననూర్ స్టాప్ వద్ద ఆపడం లేదు. హైదరాబాద్, సంగారెడ్డి, యాదగిరి గుట్ట, నారాయణ్‌ఖేడ్ తదితర బస్సులు అచ్చంపేటకు కాకుండా బైపాస్‌లో డిండి మన్ననూర్ మీదుగా శ్రీశైలానికి ప్రతినిత్యం అనేక బస్సు సర్వీసులు రాకపోకలు చేస్తుంటాయి. ఈ క్రమంలో మన్ననూర్‌లో ఉంటే బస్సులు అందుతాయనే ఆలోచనతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు ఇక్కడ ఎదురు చూస్తున్నారు. శ్రీశైలం వెళ్లాలనే ఆతృతతో ప్రమాదం అని తెలియకుండా రోడ్డు మధ్య వరకు వచ్చి బస్సులను ఆపే ప్రయత్నం చేస్తున్నారు. అయినా ఫలితం ఉండకపోవడంతో గత్యంతరం లేక ఆటోలు, జీపులను ఆశ్రయిస్తున్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లిలో ఆదివారం బీరప్ప ఉత్సవాలు నిర్వహించారు. గ్రామంలోని కుర్వ గొల్లలు ఉదయం నుంచి బీరప్ప దేవాలయాల వద్ద పూజలు చేశారు. సాయంత్రం కుంకుమ, పసుపు, పూలు, గంధంతో అందంగా అలంకరించిన బోనాలలో ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని తీసుకుని ఊరేగింపుగా వెళ్లారు. గ్రామంలోని దేవాలయం నుంచి స్వామి వారిని స్మరిస్తు ఖిల్లాఘనపురం వెళ్లే రోడ్డు వైపున ఉన్న దేవాలయం వద్దకు చేరుకున్నారు.